క్లుప్తంగా

మాజీ మంత్రి బత్తిన సుబ్బారావుకు నివాళి



బత్తిన సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు వర్ధంతి సందర్భంగా బొమ్మూరు బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అరుంధతీపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మీ అప్పా పరిమళ కుమార్ (నాని), యాళ్ల కృష్ణంరాజు, నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వేంకటేశ్వర నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయ 12వ వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఆగమశాస్త్ర పండితులు ఖండవిల్లి రాధాకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అంగర వల్లీ కాంతాచార్యులు ఈ కార్యక్రమం జరిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం గాయత్రీ నృత్యకళానికేతన్ విద్యార్థినులు నిర్వహించిన నృత్యాలు అందరినీ అలరించాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మురమండ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దుళ్ల ఫీడర్‌పై శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటలకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీధర్ వర్మ తెలిపారు. మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం గృహావసరాలు, వ్యవసాయ బోర్లకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దుళ్ల పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

కడియం: మండలంలో 94 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. శుక్రవారం సెలవు అయినప్పటికీ సచివాలయంలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి, అక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా పెన్షన్ల పంపిణీ చేశామన్నారు. మిగిలిన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

కడియం: కడియపులంకలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు శుక్రవారం ప్రారంభించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, తాడాల కొండ్రాజు, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 9 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు.

సినిమాలు



శ్యామల	: ది ఫ్యామిలీ స్టార్
సూర్యమినీ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యప్యాలెస్	: మంజుమ్మల్ బాయ్స్
స్వామి	: ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	: ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	: ఓంభీమ్‌బుష్
రంభ	: గాడ్జిల్లాఅండ్‌కాంగ్
మేనక	: భరతనాట్యం
అప్సర	: టిల్లుస్క్వేర్
కుమారి	: టిల్లుస్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: ది ఫ్యామిలీ స్టార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ది ఫ్యామిలీస్టార్, టిల్లుస్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: ది ఫ్యామిలీస్టార్



బాబూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



ఏపీ ట్రాన్స్‌కో‌అండ్‌ఓఎం సర్కిల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు ఉద్యోగుల నివాళి



దామిరెడ్డిపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న గ్రామస్తులు

సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్

- ఆయన సేవలు చిరస్మరణీయం
- నివాళులర్పించిన మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నమస్కరిస్తున్న మంత్రి వేణు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారీ వ్యవస్థ రద్దు వంటి విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ అని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కొనియాడారు. బొమ్మూరులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మంత్రి వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక, రాజకీయ ఉద్యమాలను ఏక కాలంలో నడిపిన యోధుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. దళితుల అభ్యున్నతికి పనిచేస్తూ, వారిని సామాజికంగా బలవంతులను చేసేలా సాంస్కృతిక ఉద్యమాలు కూడా నిర్వహించారన్నారు. మొట్టమొదటి దళిత ఉప ప్రధానిగా, మంత్రిగా దేశాభివృద్ధికి పలు విధాల తోడ్పాటు అందించారన్నారు. కేంద్ర కార్మికశాఖ మంత్రిగా కనీస వేతనాలు చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సవరణ) చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం వంటి వివిధ కార్మిక చట్టాలను తెచ్చారని, రైల్వేశాఖ మంత్రిగా రైల్వేలను ఆధునికీకరించి పేదలపై చార్జీల భారం పడకుండా సంస్కరణలు చేపట్టారన్నారు. దేశ రక్షణశాఖ మంత్రిగా పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో సియాచిన్‌పర్వత శ్రేణుల్లో సైనికులతో కలిసి తిరిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, చింతపర్తి రాంబాబు, చింతపర్తి చిట్టిబాబు, చిర్రా గణేష్, ఓదూరి రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, బీదం రాజు, కొల్లి నాని, రసూల్, చాపా రాజు, రాంకీ, హుకుంపేట సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

భారతరత్న ప్రకటించాలి : ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. స్థానిక 30వ డివిజన్ చర్చిగేట్ వద్ద పార్టీ డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక, నగర ఎస్సీ సెల్ చైర్మన్ కాటం రజనీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్‌రామ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ప్రజలకు ఎన్నో సేవలు

భరత్‌రామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నేతగా బాబూ జగ్జీవన్‌రామ్ ఎన్నో సేవలు అందించారన్నారు. మూడు దశాబ్దాల పాటు వివిధ శాఖలలో కేంద్ర మంత్రిగా పనిచేశారన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళులన్నారు. రౌతు సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన ఖ్యాతి అనన్య సామాన్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి

దళితుల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. బాబూ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు గద్దం ఏసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సేవలు ఎనలేనివి

కడియం: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని దామిరెడ్డిపల్లిలోని బాబూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జగ్జీవన్‌రామ్ పలువురికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తాతపూడి రాంబాబు, చింతపర్తి నాగేశ్వరరావు, చింతపర్తి చిట్టిబాబు మెరిపే రత్నం, చింతపర్తి ఇస్సాకు పాల్గొన్నారు. కడియం, జేగురుపాడు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏపీ ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలోని ఏ పీ ట్రాన్స్‌కోఅండ్‌ఓఎం సర్కిల్ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాయుడు రమేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి బాలసుబ్రహ్మణ్యం, డీఈలు కె.విజయ కుమార్, విద్యాసాగర్, శివరామకృష్ణ, ఏడీఈ షర్మిలా దుర్గ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో బాక్స్ ప్రసాద్

- ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి
- ఆత్మీయ సమావేశంలో మంత్రి వేణు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆటో కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఐఎల్‌టీడీ జంక్షన్‌లోని మాజీ డిప్యూటీ మేయర్ బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్ (బాక్సు ప్రసాద్) ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆటో యూనియన్ల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు వాహన మెయింటెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తదితర వాటిని పొందటానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసిందన్నారు. దీనిద్వారా లక్షల మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చిందని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆటోయూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజలందరి సంక్షేమం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- ధవళేశ్వరంలో ఎన్నికల ప్రచారం



ధవళేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు, మేడపాటి షర్మిలా రెడ్డి

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరం గొల్లపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, మంత్రి వేణు తనయులు నరేన్, ఉమాశంకర్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి పర్యటించారు. మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు వల్లనే పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), ఒంటెద్దు కృష్ణ, సత్యం వెంకట రమణ, మెండా రాజేష్, తలారి ప్రసాద్, షబ్బర్ బాషా, గరగ శ్రీనివాస్, పెన్నాడ జయప్రసాద్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ముత్యాల పోసికుమార్, ముత్యాల జాన్, బర్రి కామేశ్వరరావు, కల్యాణి రెడ్డి, పట్టపగలు వెంకటలక్ష్మి, హమీద్ బాషా, పందెళ్ల భానుప్రసాద్, పేరాబత్తుల శ్రీదేవి, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ధవళేశ్వరంలో పార్టీ ముఖ్య నేతలతో శుక్రవారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రచార వ్యూహాలపై చర్చించారు.

కడియం: వేమగిరి గ్రామంలోని పార్టీ ముఖ్య నాయకులతో మంత్రి వేణుగోపాలకృష్ణ భేటీ అయ్యారు. వేమగిరి గట్టుపైగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో ఈ కార్యక్రమం జరిగింది. రూరల్ నియోజకవర్గంలో గెలుపు సాధించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణను నాయకులకు వివరించారు. వెలుగుబంటి వెంకటాచలం, బడుగు ప్రశాంతకుమార్, గుబ్బల నాగార్జున, విప్పర్తి ఫణి కుమార్, కట్టా సత్యసురేష్, బైవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

కడియం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని మంత్రి వేణు అన్నారు. శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు, బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో స్థానిక మస్జిద్ ఏ కౌసర్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



కడియం మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి వేణు, వెంకటస్వామి నాయుడు, బాబు

మంత్రి వేణు మాట్లాడుతూ వైస్ జగన్‌కు ముస్లిం మైనార్టీలు అందించే అండదండలు ఎప్పటికీ మరువలేమన్నారు. రాజకీయంగా, సామాజిక భద్రత పరంగా ముస్లింలకు సీఎం జగన్ ఎప్పుడు ప్రాధాన్యమిస్తారన్నారు. 20 ఏళ్లుగా ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్న గిరజాల బాబును అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, పార్టీ నాయకులు నక్కా రాజబాబు, కానుబోయిన సాగర్, తిరుమలశెట్టి శ్రీను, దాసరి శేషగిరి, షేక్ సలీం, సర్కార్ బాషా, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనచోదకుడికి హెల్మెట్ అందజేస్తున్న సీఐ వినయ్ మోహన్

ధవళేశ్వరం: కొరియర్, పార్సిల్ సర్వీసెస్‌లలో శుక్రవారం ధవళేశ్వరం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ జీవీ వినయ్ మోహన్ ఆధ్వర్యంలో ఎస్సైలు క్రాంతికుమార్, హరిబాబు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. అలాగే ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ వినయ్ మోహన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజ్ సెంటర్‌లో హెల్మెట్‌పై వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రిజర్వ్ పోలీస్ గ్రౌండ్స్‌లోని రిటైర్ పోలీస్ అధికారుల అసోసియేషన్ హాలులో శుక్రవారం విశ్రాంత పోలీస్ అధికారుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ మాట్లడుతూ తన తండ్రి అడిషనల్ ఎస్పీగా చేశారని, మేనమామలు, తాత కూడా పోలీస్‌శాఖ లోనే ఉద్యోగాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లుగా నగరంలో పల్మనాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నానని పేర్కొన్నారు. పదవుల కోసం పార్టీలు మారే సంస్కృతి తనది కాదన్నారు. రాబోయే ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు సాల్మన్ రాజు, న్యాయవాది ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గోరంట్ల ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా కుటుంబ సమేతంగా రాయుడుపాకలు గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అరుంధతీపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాయుడుపాకలు నుంచి కోలమూరు మీదుగా కొంతమూరు వరకూ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాజానగరం: రబీ ధాన్యం కొనుగోలు కోసం మండలంలో ఏర్పాటు చేసిన 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. రాజానగరం, కానవరం, తోకాడ, ముక్కినాడ, నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, సీతారామపురం, వెలుగుబంద, పాలచర్ల, నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడులలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ షేక్ ఇమామిఖాసిం ప్రారంభించారు. మొదటి రోజు 334.40 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు.

ఆదెమ్మ దిబ్బను అభివృద్ధి చేస్తా

- టీడీపీ నాయకుల వ్యాఖ్యలు అనైతికం
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ భరత్‌రామ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: తాను ఎమ్మెల్యే అవ్వగానే ఈ ఆదెమ్మ దిబ్బ ప్రాంతాన్ని దత్తత తీసుకుని, అత్యద్భుతంగా తీర్చిదిద్దుతానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. నగరంలో ఆదెమ్మ దిబ్బ ప్రాంతాన్ని చూసేసరికి చాలా బాధేస్తోందని, ఇప్పటివరకూ నగరాన్ని పాలించిన టీడీపీ నాయకులు దీన్ని పట్టించుకోలేదన్నారు. స్థానిక 36వ డివిజన్‌లోని ఆదెమ్మ దిబ్బ, వాంబే గృహాల ప్రాంతంలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడి సమస్యలను, ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ వాంబే గృహాలు కట్టించి సుమారు రెండు పుష్కరాల కాలం పైమాటేనని, అప్పట్నుంచీ ఈ ప్రాంతానికి నాయకులు కేవలం ఓట్ల కోసం తప్పిస్తే, సమస్యలు పరిష్కరించడానికి సమయమే లేదన్నట్లు వ్యవహరించడం దురదృష్టకరం అన్నారు. అడుగడుగునా ఇక్కడ సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. మేయర్లుగా, ఎమ్మెల్యేలుగా పదవులు పొందిన టీడీపీ నేతలు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు 16 ఏళ్లు అధికారంలో ఉండి, నగరాన్ని ఎంత భ్రష్టు పట్టించారో చెప్పడానికి ఈ ఆదెమ్మ దిబ్బ ప్రాంతం, జీర్ణావస్థకు చేరుకున్న వాంబే గృహాలే సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. నగరంలో 25 వేల నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇస్తే, ప్రతిపక్ష టీడీపీ నేతలు అవి బోగస్ పట్టాలని వ్యాఖ్యానించడం అనైతికమన్నారు. ఇటువంటి తప్పుడు, నిరాధార ఆరోపణలు చేసేవారికి ఎక్కడికక్కడ ప్రజలు, లబ్ధిదారులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ భరత్‌రామ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేపర్ మిల్లు యాజమాన్యం తీరు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

ప్రకాశం నగర్: ఏపీ పేపర్‌మిల్లు యాజమాన్యం తీరు అప్రజాస్వామికమని, నిరంకుశ విధానాలను విడనాడి తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు 72 గంటలుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ మిల్లులోని కార్మిక సంఘాలు వేతన ఒప్పందం కోసం గత 6 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.మధు మాట్లాడుతూ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల ప్రతి డిమాండ్ నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో కార్మికుల కుటుంబాలతో అన్ని కార్మిక సంఘాల మద్దతు తీసుకుని నగరలో భారీ ర్యాలీ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ కార్యదర్శి జోజి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, ఎస్ఎస్ మూర్తి, మాధవ్, బి.పవన్ పాల్గొన్నారు.